యూజీడీ పంపింగ్ స్టేషన్‌ను ప్రారంభించరూ !

- మురుగు పోయే మార్గం లేక అవస్థలు
- పర్యటనలకే పరిమితమైన అధికారులు
- డ్రెయిన్లు నిర్మించాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ జీవీఆర్ నగర్‌లో తుది దశకు చేరిన యూజీడీ పంపింగ్‌స్టేషన్‌ను సత్వరమే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయక నగర్ తదితర ప్రాంత వాసుల కోసం యూజీడీ పంపింగ్ స్టేషన్‌ను నిర్మించారు. ఇప్పటికే ఇక్కడ యూజీడీ పంపింగ్ పైపులైన్లు పూర్తయ్యాయి. కానీ కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన యూజీడీ పంపింగ్ స్టేషన్ 10 ఏళ్లు దాటినప్పటికీ అందుబాటులోకి రాకపోవటం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవటంతో పాటు ఎవరికి వారు తమ మురుగును ఖాళీ స్థలాలలోకి వదలివేస్తున్నారు. ఇటీవల ఇక్కడ నిర్మాణాలు పెరుగుతుండటంతో వాడిన మురుగును ఎక్కడికి వదలాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఎప్పటికప్పుడు యూజీడీ అందుబాటులోకి వస్తుందని తమ కష్టాలు తీరుతాయని ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశే మిగిలింది.

స్పందించని అధికారులు

ఇక్కడ యూజీడీ పంపింగ్ పైపులైన్లు పూర్తికావటంతో పాటు పంపింగ్ స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. కానీ సంవత్సరాలు గడుస్తున్నా యూజీడీ పంపింగ్‌స్టేషన్ పైపులైన్లను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అనుసంధానం చేసి పంపింగ్ స్టేషన్‌ను మాత్రం ప్రారంభించటం లేదు. పత్రికలలో వచ్చినప్పుడు ప్రజలు ఆందోళన చేసినప్పుడు వస్తున్న అధికారులు త్వరలోనే ఇక్కడ యూజీడీ పంపింగ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పి వెళ్లిపోతున్నారు. సాక్షాత్తూ నగరపాలకసంస్థ కమిషనర్లు సైతం పలు మార్లు యూజీడీ పంపింగ్‌స్టేషన్‌ను పరిశీలించి అందుబాటులోకి తీసుకురావాలంటూ అధికారులను ఆదేశించారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే ఉంటున్నాయి. దీంతో మురుగు బయటకు పోయే మార్గం లేక ప్రజలు నానా యాతన పడుతున్నారు.



యూజీడీ పంపింగ్ స్టేషన్



సంపు



ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షపు, మురుగు నీరు

ఆదాయం కోల్పోతున్న వీఎంసీ

అధికారుల నిర్లక్ష్యం వల్ల నగరపాలకసంస్థ యూజీడీ ద్వారా వచ్చే ఆదాయం కోల్పోతోంది. ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తే యూజీడీ కనెక్షన్ల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వీఎంసీకి వస్తుంది. కానీ పంపింగ్‌స్టేషన్‌ను ప్రారంభించకపోవటం వల్ల వీఎంసీకు వచ్చే ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంపింగ్‌స్టేషన్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

మురుగు పోయే దారేదీ..

30వ డివిజన్ జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేవు. దీంతో వర్షపు నీరుతో పాటు ఇంట్లో వాడిన మురుగు సైతం బయటకు పోయే మార్గం లేక అవస్థలు పడుతున్నారు. ఖాళీ స్థలాలోకి మురుగు నీటిని వదలివేయటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు దోమలకు ఆవాసకేంద్రంగా మారాయి. పన్నులు వసూలు చేసే అధికారులు కనీసం మురుగు కాలువలు అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలు లేక అవస్థలు..



మా ప్రాంతంలో మురుగు కాలువలు లేకపోవటంతో మురుగు సమస్యలు అధికంగా ఉన్నాయి. యూజీడీ అందుబాటులోకి వస్తే కష్టాలు తీరుతాయని కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నాం. కానీ దోమలు పెరుగుతున్నాయి తప్ప యూజీడీ మాత్రం అందుబాటులోకి రాలేదు. మురుగు నీటిని ఖాళీ స్థలాల్లోకి వదలాల్సి వస్తోంది. దీని వల్ల తరచూ గొడవలు జరుగుతున్నాయి.

– శంకర్, స్థానికుడు, దావు బుచ్చయ్యకాలనీ

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. స్థానికంగా ఇళ్లు, జనాభా పెరుగుతున్న దృష్ట్యా మురుగు సమస్యలు పెరుగుతున్నాయి. పంపింగ్ స్టేషన్‌కు ఉన్న కొద్దిపాటి పనులు రైల్వేవారి అనుమతులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. లక్షలాది రూపాయల వ్యయంతో ఇంటిని నిర్మించుకుని, మురుగు పోయే మార్గం లేక అవస్థలు పడుతున్నాం.

– జి.వెంకటేశ్వరరావు, స్థానికుడు, దేవీనగర్

క్లుప్తంగా

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి



విజయవాడకల్చరల్: సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని మేజర్ కౌతా సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. శ్రీ దుర్గా అమ్మవారి విశ్వజననీ భక్తజన సంఘం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో ఆదివారం సంప్రదాయ నృత్యపోటీలు, భక్తి గీతాలపాన పోటీలు, ఏకపాత్రాభినయం పోటీలను నిర్వహించారు. మేజర్ కౌతా సుబ్రహ్మణ్య శాస్త్రి మాట్లాడుతూ.. సంప్రదాయ నృత్యాలు దేశ సంస్కృతిలో భాగమన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విశ్వజననీ భక్తజన బృందం వ్యవస్థాపకుడు బయ్యపు సుబ్బారావు, డాక్టర్ ఆర్ సురేష్‌కుమార్, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం తదితర అంశాలలో సోలో విభాగం, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించి విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

58వ డివిజన్‌లో సామూహిక సీమంతాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 58వ డివిజన్ అజిత్‌సింగ్ నగర్ కృష్ణ హోటల్ సెంటర్ వద్ద మాజీ కార్పొరేటర్ సిరియ జగదాంబ, సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సీమంతాలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీర, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం భోజనాలు వడ్డించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గర్భిణులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన 14 మంది చిన్నారులు తమ నృత్య ప్రతిభను చాటారు. నృత్యాచార్య కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

మధురంగా సాగిన చిత్ర గీతాలాపన



విజయవాడకల్చరల్: గీత్ సంగీత్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం సయ్యద్ గౌస్ బృందం నిర్వహించిన హిందీ, తెలుగు చిత్ర గీతాలాపన కార్యక్రమం మధురంగా సాగింది. హిందీ చిత్ర గీతాలను సయ్యద్ గౌస్, కిశోర్‌కుమార్, రఫీ ఆలపించారు. తెలుగు చిత్ర గీతాలను టీఎస్ రెడ్డి, ప్రిన్స్, అంజు స్వామి, సీతాదేవి, రేష్మ, మల్లీశ్వరి, రామభద్రకుమార్‌లు ఆలపించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గాయకుడు గౌస్‌కు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. వివిధ సంస్థల ప్రతినిధులు సీహెచ్ చిట్టిబాబు, ప్రసూనా రామన్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో 14 మోడల్ ప్రైమరీ పాఠశాలలు

విజయవాడరూరల్: మండలంలో ఈ విద్యా సంవత్సరం 14 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ ఏ.సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను నియమించి బోధన చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలల వివరాలు.. గొల్లపూడి క్లస్టర్‌లో గొల్లపూడి మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, నిడమానూరు, దొనే ఆత్కూరు, రామానగర్, ఎనికేపాడు మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, తాతాపురం స్కూల్, నున్న క్లస్టర్‌లో నున్న మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, నున్న పడమర ఎలిమెంటరీ స్కూల్, పాతపాడు ఎలిమెంటరీ స్కూల్, రామవరప్పాడు క్లస్టర్‌లో రామవరప్పాడు మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, పీఎస్‌ఆర్ కాలనీలో ఎలిమెంటరీ స్కూల్, ప్రసాదంపాడు గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్, జక్కంపూడి క్లస్టర్ జక్కంపూడి ఎలిమెంటరీ స్కూల్, కొత్తూరు తాడేపల్లి ఎలిమెంటరీ స్కూల్‌ను మోడల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అలాగే మండలంలో 14 బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటితోపాటు మండలంలో ఎనిమిది హైస్కూల్స్, నాలుగు మండల ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ సత్యనారాయణపురం 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి హోదాలను, వయసును మరిచిపోయి ఆదివారం ఆడిపాడి సందడి చేశారు. ప్రస్తుతం సత్యనారాయణపురం రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ పాఠశాల మూసివేసి రైల్వే ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తున్నప్పటికీ, అనుమతితో అక్కడే పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. నాటి సంగతులను తలచుకుని చేసిన అల్లరి, విద్యాభ్యాసం చేసిన రోజులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని విద్యార్థి అనుభూతిని పొందారు. అనంతరం ఆశ్రమంలో పిల్లలకు భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.వేణు, జి.దుర్గాప్రసాద్, పి.రాజేష్, డి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత భవితకు బంగారుబాట

విజయవాడకల్చరల్: సృజనాత్మకత యువత భవితకు బంగారుబాట అని ట్రాఫిక్ జోన్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, గ్రంథాలయ పునర్వికాస వేదిక, స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బాల బాలికల శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పారు. గ్రంథాలయాలు తన జీవిత గతిని మార్చాయన్నారు. గ్రంథాలయాలతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

బాల బాలికలకు దిశానిర్దేశం..

గ్రంథాలయ పునర్వికాస వేదిక నాయకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. శిబిరంలో అనేక విషయాల్లో వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆదివారం నాటి శిబిరంలో మినీ డిక్షనరీను తయారు చేయడం, కథలను చదవడం, ఇతరులకు వినిపించడం అంశంగా శిక్షణ ఇచ్చారు. సుధా, స్పందన, నవసాహితీ పబ్లికేషన్ల తరఫున జే.నరసింహమూర్తి, ఏ.భాస్కరరావు, కె.రవి పాల్గొని శిబిరంలో పాల్గొన్న బాల బాలికలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిభ చూపిన బాల బాలికలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

యోగాతో శారీరక, మానసిక రుగ్మతలకు చెక్

మధురానగర్(విజయవాడసెంట్రల్): యోగా ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని.. యోగాతో శారీరక, మానసిక రుగ్మతలకు చెక్ పెట్టవచ్చని వీఎంసీ సర్కిల్-3 జోనల్ కమిషనర్ ప్రభుదాస్ అన్నారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఆదివారం యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఆరోగ్య పరిరక్షణకు యోగా ఒక చక్కటి సాధనంగా వినియోగించుకోవాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే నగరం, జిల్లా, రాష్ట్రం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని ప్రతీ ఒక్కరూ గుర్తించాలని చెప్పారు. యోగా ట్రైనర్ డాక్టర్ డి.యుగంధర్ యోగా విశిష్టతను యోగాసనాలు వేయటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నెల రోజుల పాటు తాము అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు సహాయ సహకారం అందించాలన్నారు. అనంతరం యోగాసనాలు వేయించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో విజయకృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వెలగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేయిస్తున్న ట్రైనర్ యుగంధర్

ఐదో రోజుకు చేరిన హనుమజ్జయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి పర్యవేక్షించారు.

నేడు అన్నప్రసాద వితరణ

హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నప్రసాద వితరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఈవో కోరారు.


కారుమబ్బులు కమ్ముకొని...



దుర్గగుడి గోపురం సమీపంలో నల్లటి మబ్బులు

బెజవాడలో ఆదివారం కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా, మధ్యాహ్నం మూడు గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నల్లటి కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఆ తర్వాత భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో ఇబ్బందిపడిన నగర వాసులు వర్షంతో కొంత సేదతీరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రకాశం బ్యారేజీ సమీపంలో కమ్ముకున్న మబ్బులు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు నేర ప్రవృత్తిని మానుకుని సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ప్రవర్తనతో ఉండాలని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలను దూరం చేసుకుని, ఎటువంటి నేరాల జోలికి వెళ్లకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేశామని, ఎటువంటి గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

నున్న రూరల్ పీఎస్‌లో కౌన్సెలింగ్



పాయకాపురం(విజయవాడరూరల్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని మాని, సత్ప్రవర్తనతో మెలగాలని నున్న రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ చెప్పారు. నున్న పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేస్తే శిక్ష తప్పదన్నారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని, ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలతో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌన్సెలింగ్‌లో స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల మనసు గెలుచుకున్న ఆటోడ్రైవర్



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో ఆదివారం సాయంత్రం త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ ప్రత్యేకమైన సంఘటన ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. తనిఖీల సమయంలో ఓ ఆటోడ్రైవర్ యూనిఫామ్ ధరించి తన పేరు, లైసెన్స్ నంబర్, బ్యాడ్జి నంబర్ వంటి వివరాలు స్పష్టంగా కనిపించేలా బ్యాడ్జి పెట్టుకుని నిబంధనల ప్రకారం ఆటో నడుపుతున్నాడు. అతడిని గుర్తించిన సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ వెంకట్ కుమార్‌లు టాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ ప్రయాణికులకు ఆదర్శంగా నిలుస్తున్న డ్రైవర్ పి.రవీంద్రరావును అభినందిస్తూ ఆటో డ్రైవర్ల సమక్షంలో పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నగరంలో ఆటో డ్రైవర్లందరూ రవీంద్రరావును ఆదర్శంగా తీసుకుని ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ఇటువంటి డ్రైవర్లు నగరానికి గౌరవాన్ని తీసుకువస్తారని చెప్పారు. తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న నాలుగు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు.

ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతం..

యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం నగరంలోని వివిధ కేంద్రాల్లో నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని ఉదయాన్నే నగరానికి చేరుకున్నారు. విజయవాడ వన్‌టౌన్ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల చిత్రాలివి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయం, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలోనూ వినతులు స్వీకరిస్తామన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాల్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.